

ఎస్వీయూలో రెండు రహదారులకు ఓకే

- మరో 14 కనెక్టివ్ రోడ్లకు ప్రతిపాదన
- అభివృద్ధిపై టిడిపి, వైసిపి మధ్య రగడ
- కౌన్సిల్ నుంచి టిడిపి కార్పొరేటర్ బాయ్‌కాట్
- నగరంలో రెండు కోట్లతో డబుల్ డెక్కర్ బస్సు
- టిటిడి నూతన ఛైర్మన్‌కు కౌన్సిల్ సన్మానం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

ఎస్వీయూలో రెండు మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి తిరుపతి కౌన్సిల్ ఓకే చేసింది. అలాగే మరో 14 కనెక్టివ్ రోడ్లకు ప్రతిపాదన సిద్ధం చేశారు. తిరుపతి కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం ఎస్వీ సెనెట్‌హాల్లో జరిగింది. తిరుపతి అభివృద్ధికి అవసరమైన మాస్టర్‌ప్లాన్ రోడ్లపై వాడివేడిగా చర్చ జరిగింది. 111 అంశాలపై సుదీర్ఘకంగా చర్చ నడిచింది. ముఖ్యంగా వివాదాస్పదంగా మారిన ఎస్వీ యూనివర్సిటీ వద్ద మూడు మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించి పాలకమండలి, విద్యార్థులు, ప్రజల నుంచి అభ్యంతరాలు రావడంతో రెండింటికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునిక్రిష్ణ అభ్యంతరం వ్యక్తం చేయడంతో కౌన్సిల్‌ను బాయ్‌కాట్‌చేస్తూ వెళ్లిపోయారు. ఎస్వీయూలో వేస్తున్న రెండు మాస్టర్‌ప్లాన్ రోడ్లపై డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్పొరేటర్లకు వివరించారు. మాస్టర్‌ప్లాన్ రోడ్ల వల్ల తిరుపతి ట్రాఫిక్ సమస్య తగ్గే అవకాశం ఉందన్నారు. రహదారులతో పాటు తిరుపతి నగరంలో రెండు కోట్ల 14 లక్షల రూపాయలతో డబుల్ డెక్కర్ బస్సు కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. తిరుపతికి వచ్చే యాత్రికులకు డబుల్ డెక్కర్ బస్సు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇలాంటి బస్సు కేవలం హైదరాబాద్‌లో మాత్రమే ఉందన్నారు.



కౌన్సిల్ సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష



టిటిడి నూతన ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకోనున్న ఎంఎల్ఎ కరుణాకర్‌రెడ్డికి ఘన సన్మానం

సుందరంగా నూతన రహదారులు : ఎంఎల్ఎ

ఏ కార్పొరేషన్‌లోనూ చేయని విధంగా తిరుపతిలో మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణం సుందరంగా జరుగుతోందని తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి ప్రశంసించారు. రహదారులకు మహనీయుల పేర్లను పెట్టడం అభినందనీయమన్నారు. తిరుపతి అభివృద్ధికి నిరంతరం తాము కృషి చేస్తానని స్పష్టం చేశారు.

మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి నగరంలోని డివిజన్లలో ప్రజలకు అవసరమైన పనులను చేపట్టుటకు కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆమోదించామన్నారు. ఎస్వీ యూనివర్సిటీ నుంచి ఎన్‌సిసి నగర్ మీదుగా జూపార్కును కలుపుతూ ఓ రోడ్డు, ఎస్వీయూ గ్యాస్ గోడౌన్ పక్కగా ఆర్ట్స్ కళాశాలను ఆనుకుని వెళుతూ జూపార్కును కలిపేలా మరో రోడ్డుకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. మంచినీళ్లకుంట అభివృద్ధికి టిటిడి 75 లక్షలు కేటాయిస్తూ నిర్వహణను టిటిడికి అప్పగిస్తూ ఆమోదం తెలిపింది.

ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్కే బాబు, కార్పొరేటర్లు నరసింహాచారి, అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు



ఎస్వీయూ రెండు రహదారుల వషయమై వివరిస్తున్న అభినయ్‌రెడ్డి

17న వాచీలు టెండర్ కమ్ వేలం

ప్రజాశక్తి-తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలను 17న టెండర్ కమ్ వేలం వేయనున్నారు. ఇందులో హెచ్ఎంటి, సీకో, సిటిజన్, టైమ్స్, సోని, టైటాన్, క్యాషియో, టైమెక్స్, ఆల్విన్, సొనాట, టైమ్‌వెల్, ఫాస్ట్‌ట్రాక్ కంపెనీల వాచీలున్నాయి. కొత్తవి/ ఉపయోగించిన/ పాక్షికంగా దెబ్బతిన్న వాచీలు మొత్తం 14 లాట్లు వేలంలో ఉంచారు. ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో కార్యాలయ వేళల్లో సంప్రదించగలరు.

ఉదయ్‌కుమార్‌కు డాక్టరేట్



ఉదయ్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని భౌతిక శాస్త్ర పరిశోధక విద్యార్థి కే. ఉదయ్ కుమార్‌కు డాక్టర్ డిగ్రీని ప్రదానం చేసినట్టు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. భౌతికశాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఆచార్య సికే జయశంకర్ పర్యవేక్షణలో " కాంపోజిషన్ డిపెండెంట్ స్పెక్ట్రోస్కోపిక్ ప్రాపర్టీస్ ఆఫ్ సిఈ3ం, ఎన్డి 3ం, ఎస్ఎమ్ 3ం, అండ్ ఈఆర్ 3ం ఆయన్స్ డోప్డ్ బైనరీ బోరోబిస్ముత్ గ్లాసెస్ " అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. ఉదయ్ కుమార్ పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్‌లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు వెల్లడించారు. ఉదయ్ కుమార్‌కు డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

యూనివర్సిటీ పరిరక్షణకే ఉద్యమం



విద్యార్థుల నిరసన కార్యక్రమం

ప్రజాశక్తి-క్యాంపస్: యూనివర్సిటీ గురించి తీర్మానం చేసే హక్కు మున్సిపల్ కౌన్సిల్‌కు ఎక్కడిదని? యూనివర్సిటీ పాలకమండలి, ఉప కులపతిని అవమానిస్తున్నారని విద్యార్థి యువజన సంఘాల ఐక్యతరచన సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాయకులు ఆర్‌కె నాయుడు, రాగల ఆనందగౌడ్, రామ్మోహన్, చిన్నా, బండి చలపతి, అక్కులప్పనాయక్, కొట్టే హేమంత్ రాయల్ తదితరులను కౌన్సిల్ సమావేశం జరిగే ఆడిటోరియం వద్దకు వెళ్లనీకుండా అడ్డుకున్నారు. యూనివర్సిటీ పరిరక్షణ కోసం తాము చేస్తున్న ఆందోళనకు పూర్వ విద్యార్థులు సైతం అడుగు కలపాలని కోరారు. యూనివర్సిటీ పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని తెలిపారు.

వీఆర్‌ఏల దీక్షకు మాజీ ఎంపీ మధు సంఘీభావం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించకుంటే ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు అన్నారు. మంగళవారం గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్‌ఏలు) చేపట్టిన 36 గంటల దీక్షల విరమణ సందర్భంగా పెనుమల్లి మధు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన సభను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న ధోరణి అమానవీయంగా ఉందని తీవ్రస్థాయిలో విమర్శించారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వమని ఆదేశించి ఏళ్ళు గడుస్తున్నా రూ.26వేల వేతనానికి వీఆర్‌ఏలు నోచుకోలేదని అన్నారు. గోవిందస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. నాగరాజులు ప్రసంగిస్తూ వీఆర్‌ఏల సమస్యలు న్యాయమైనవని సిఐటియు సంపూర్ణ సహకారం అందిస్తుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు పుల్లయ్య, వీఆర్‌ఏల సంఘం ప్రధాన కార్యదర్శి సుబ్బయ్యతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు సమస్యల పరిష్కారం కై వినతి పత్రం సమర్పించారు.



మాట్లాడుతున్న మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు

ఉప ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి-సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలో పలు పంచాయతీలలో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల ఎన్నిక ప్రక్రియ ప్రారంభమయ్యింది. ఇందులో భాగంగానే ఎన్నికల షెడ్యూల్ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 8వ తేదీ నుంచి పదవ తేదీ వరకు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్ స్వీకరణ, 11వ తేదీ నామినేషన్ల పరిశీలన, తిరస్కరించిన నామినేషన్లపై 12వ తేదీ ఆర్డీవోకు అప్పీల్ చేయడం, 13వ తేదీ తిరస్కరించిన నామినేషన్పై ఆర్డీవో తుది నిర్ణయం, 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ ఉపసంహరించుకోవడం, పోటీ చేయు అభ్యర్థుల జాబితా ప్రకటించడం, 19వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు పోలింగ్, అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల పైన ఓట్లు కౌంటింగ్ తదుపరి ఫలితాలను ఎన్నికల పర్యవేక్షకులు ఎంపీడీవో చంద్రశేఖర్ వివరించారు. కాగా సత్యవేడు మండలంలో వివిధ కారణాలతో ఖాళీగా ఏర్పడ్డ దాసుకుప్పం పంచాయతీ మూడవ వార్డు, మల్లవారి పాలెం తూర్పు ఆరవ వార్డు, ఇరుగుళం రెండవ వార్డు ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ క్రమంలో ఎన్నికల అధికారిగా నియమితులైన మణిబాబు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నుంచి నామినేషన్లను స్వీకరించే ప్రక్రియ ప్రారంభమైంది. అయితే ఈరోజు మంగళవారం కావడంతో నామినేషన్ వేయడానికి ముందుకు రాని పరిస్థితి ఉండొచ్చని పలువురు చెప్తున్నారు. పైగా సత్యవేడు మండలంలో వార్డు సభ్యుల ఎన్నిక ఒక్క దాసుకుప్పం మినహా మిగిలిన రెండు పంచాయతీల్లోనూ ఏకగ్రీవం అయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.



సత్యవేడులో ఉప ఎన్నికల నామినేషన్ల స్వీకరణలో అధికారులు

వరి 'పొట్టకు' వచ్చే దశలో పొటాష్ అవసరం : ఏడీఏ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: జిల్లాలో జూన్‌లో నాట్లు వేసిన పొలాల్లో వరి పొట్ట దశకు వస్తోందని, ఈ దశలో ఎకరాకు 35 నుంచి 40 కిలోల యూరియాతో పాటు 20 కిలోల పొటాష్ తప్పక వేయాలని వ్యవసాయ శాఖ ఎడిఎ మెరుగు భాస్కరయ్య సూచించారు. ధాన్యం జల్లు లేకుండా నాణ్యతగా ఉంటుందని, తెల్లచీడ, మొబ్బ పురుగు వంటి చీడల సమస్య తగ్గుతుందన్నారు. పొటాష్ ఎరువు బస్తా ధర అధికంగా రూ.1700 ఉండటం వల్ల పొటాష్ వాడకం తగ్గించారన్నారు. ఇది పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని, దీనిని అదునుగా తీసుకుని వ్యాపారులు ఆర్గానిక్ పొటాష్ చౌకగా బస్తా 800-850 దొరుకుతుందని రైతులను మభ్యపెడుతున్నారన్నారు. సాధారణ పొటాష్ ఎరువులో 60 శాతం పొటాష్ పోషకం ఉంటే, ఆర్గానిక్ పొటాష్‌లో కేవలం 11-12 శాతం పొటాష్ పోషకం మాత్రమే ఉంటుందని తెలిపారు. ఇది తెలియక రైతులు మోసపోతున్నారు .కాబట్టి రైతులు సాధారణ పొటాష్ ఎరువును 20 కిలోలు వేసుకున్నా పంటకు ఎకరాకు 12 కిలోల పొటాష్ పోషకంను రూ.680 కే అందించవచ్చు . అదే ఆర్గానిక్ పొటాష్ రూ. 800-850 ధర పెట్టి వేసినా కేవలం 6 కిలోల పొటాష్ పోషకమే అందుతుంది . ఈ వాస్తవాన్ని రైతులు గుర్తించి జాగ్రత్తగా ఉండాలని మనవి.



వరి పైరు

8న తిరుపతిలో బస్సుయాత్ర ముగింపు సభ

- 23న ఏలూరులో కార్యాచరణ ప్రకటన
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిపిఐ ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేపట్టామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. ఈనెల 17వ తేదీ వైజాగ్‌లో ప్రారంభం అయ్యే బస్సు యాత్ర సెప్టెంబర్ 8 వరకు కొనసాగుతుందని తెలిపారు. సెప్టెంబర్ 8వ తేదీ ముగింపు సందర్భంగా తిరుపతి నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం తిరుపతిలో ఏర్పాటుచేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు 150 అడుగులు ఎత్తు నిర్మాణం జరగాల్సి ఉందని, అయితే 45.72 వరకు ఎత్తు తగ్గించి నిర్మాణం చేస్తే ప్రయోజనం ఉండదన్నారు. ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడూ అదే ఎత్తును కొనసాగించారని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి పూర్తి ప్రయోజనాలు పక్కన పెట్టి జాతీయ ప్రాజెక్టు ఖర్చులు కేంద్రానికి తగ్గించడానికి చూస్తున్నారని విమర్శించారు. కేంద్రం యొక్క కుట్ర పూరిత నిర్ణయంపై జగన్ రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. 150 అడుగులు ఎత్తు ఉంటే 194 టీఎంసీలు నీటి నిలువ ఉండే అవకాశం ఉందన్నారు. తద్వారా ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తాలకు నీరు అందే అవకాశం ఉంటుందన్నారు. దీంతోపాటు 940 మెగావాట్లు విద్యుత్ శక్తి ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ముంపు నిర్వాసితులకు దొంగ మాటలు చెప్పి పరిహారం ఇవ్వకుండా మోసం చేశారన్నారు .ఈ నేపథ్యంలో ఈ నెల 23న ఏలూరులో కార్యచరణ రూపొందిస్తామని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య పాల్గొన్నారు.

వీఎస్‌కండ్రిగ దళితులకు సాగుపట్టాలివ్వాలి: వ్యకాసం



కలెక్టరేట్ ఎదుట సాగుపట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి జిల్లా బిఎన్ కండ్రిగ మండలం విఎస్ కండ్రిగ దళితులు గత 30 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మాజీ ఎంపీ పి మధు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు మాట్లాడుతూ దళితులు 30 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్న భూములను రెవెన్యూ అధికారులు వేరే ఆరుగురికి పట్టాలు చేయడం ఎంతవరకు న్యాయమని అధికారుల మీద ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా తిరుపతి జిల్లా కలెక్టర్ స్పందించి బినామి పట్టాలు రద్దుచేసి సాగులో ఉన్నటువంటి 70 మంది దళితులకు పట్టాల మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే వ్యవసాయ కార్మిక సంఘం అన్ని సంఘాలను కలుపుకొని పోరాటం ఉదతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గ్రామస్తులు యన్ కష్ణయ్య, వెంకట కష్ణయ్య, వెంకటరమణయ్య, మణి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు

మత్స్యకారుల నష్టాలను గుర్తించాలి: ఎంపీ గురుమూర్తి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: 'గత మూడేళ్లలో మత్స్యకారులు సముద్ర చేపల వేట ద్వారా కలిగిన నష్టాలను గుర్తిస్తున్నారా?' అని తిరుపతి ఎంపి గురుమూర్తి ప్రశ్నించారు. ఎక్కువ నష్టాలు సంభవించడానికి కారణాలు, పరిష్కరించడానికి తీసుకున్న చర్యలను, డీజిల్ ధరలతో ఇబ్బందులను గుర్తించాలన్నారు. కేంద్ర మత్స్యశాఖా మంత్రి పర్షోత్తం రూపాల సమాధానం ఇస్తూ మత్స్యశాఖ వద్ద నష్టాలకు సంబంధించిన ఎటువంటి నివేదిక లేదని తెలిపారు. నీలి విప్లవాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో ప్రధాన్ మంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని కేంద్రం తీసుకొచ్చిందన్నారు.

జ్వరాలు విజృంభించకుండా జాగ్రత్తలు: డిఎంహెచ్ఒ



మలేరియా జిల్లా అధికారులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ : కీటక జనిత వ్యాధులైన డెంగ్యూ మలేరియా కేసులు జిల్లాలో పెరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యు శ్రీహరి జిల్లా వైద్యాధికారులకు సూచించారు. స్థానిక డీఎంహెచ్వో కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జికె రుప్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే ని తప్పకుండా వంద శాతం గహాలను సందర్శించి, లార్వాలను నిర్మూలించాలని ఆదేశించారు. సచివాలయ ఏఎన్ఎంలు గుర్తించిన సమస్యలను సెక్రెటరీ వీలైనంత తొందరగా పరిష్కరించాలన్నారు. వైద్యాధికారులు తరచూ ప్రైవేట్ ఆసుపత్రి ల్యాబ్ లను సందర్శించి తగు సూచనలు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో, ఉన్నత పాఠశాలల్లో కీటక జనత వ్యాధుల నిర్మూలన పై అవగాహన కల్పించాలని తెలిపారు.

గూడూరు సెబ్ సీఐకి ప్రశంసాపత్రం



సమీక్షా సమావేశంలో సెబ్ సీఐలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి: గూడూరు సెబ్ సిఐ విజయ్ కుమార్ ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్‌పి ఎ.రాజేంద్ర చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. శ్రీ ఆదిశంకర గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సమావేశ మందిరంలో మంగళవారం నేర సమీక్షా సమావేశం జరిగింది. గూడూరు, వాకాడు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి సెబ్ సిఐలకు పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులు త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని, నేరస్తులకు శిక్షపడేలా దర్యాప్తు ఉండాలని, గంజాయి నాటు సారా వంటి నేరాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. పాత నేరస్తులకు గంజాయి తాగే అలవాటున్న వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని, విద్యార్థుల్లో డ్రగ్స్ పట్ల చైతన్యం కలిగించాలని, పాత నేరస్తులపైన బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. రిపీటెడ్ నేరస్తులపైన పీడీ యాక్ట్ ప్రయోగించాలన్నారు. చెన్నయ్, కలకత్తా జాతీయ రహదారుల్లో విస్తృతంగా వాహనాలను తనిఖీ చేయాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన గూడూరు సెబ్ సిఐ పి.విజయ్‌కుమార్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

చిరుధాన్యాలతో వంటకాల పోటీలు



హోం సైన్స్ విద్యార్థుల వంటకాలను పరిశీలిస్తున్న వీసీ

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని హెూమ్ సైన్స్ ఫుడ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మిల్లెట్స్ డే సందర్భంగా విద్యార్థులకు, పరిశోధకులు, బోధన సిబ్బంది మధ్య చిరుధాన్యాలకు సంబంధించిన వంటకాలపై పోటీలను నిర్వహించారు. బహుమతుల ప్రదానోత్సవానికి ఉపకులపతి ఆచార్య కే.రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలను వారానికి మూడు రోజులు తీసుకోవడం వలన మధుమేహం, రక్తపోటు, మలబద్ధకం వంటి వ్యాధుల తీవ్రతను తగ్గించుకోవచ్చు అన్నారు. విద్యార్థులకు చిరుధాన్యాలలో వంటకాల పోటీలు పెట్టడం ద్వారా వంటకాలు తయారు చేయడంలో వారికి మంచి నైపుణ్యం వస్తుందన్నారు. చిన్న వయసు నుంచే మంచి ఆహారపు అలవాట్లు క్రమబద్ధంగా పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని జీవించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య కేవీ సుచరిత, ఆచార్య ఆర్కే అనురాధ, ఆచార్య కే అనురాధ, డాక్టర్ కే. మంజుల, డాక్టర్ బి.స్వరూపరాణి, అనిత, కళ్యాణి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికంతో శ్రీమహాలక్ష్మి యాగం పూర్ణాహుతి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి నగరంలోని కొర్లగుంటలో డి బి ఆర్ హాస్పిటల్ రోడ్ (శ్రీ కన్వెన్షన్ ఎదురుగా) పురుషోత్తం మాస్ మహెూత్సవం సందర్భంగా లోక కళ్యాణార్థం ఝలారియా పీఠం యొక్క ప్రస్తుత గురువు, జగద్గురు రామానుజాచార్య శ్రీ ఝల్రియపీఠాదపతి 1008 స్వామీజీ శ్రీ ఘన్‌ష్యామాచార్యజీ మహారాజ్ ఆధ్వర్యంలో 225 కుండల మహాలక్ష్మి మహాయాగం 3వ తేదీ ప్రారంభమై 8న నిర్వహించిన ముఖ్య ఘట్టం పూర్ణాహుతితో పరిపూర్తి అయ్యింది. ఎరుపు రంగు వస్త్రంతో వివిధ రకాల సుగంధ పరిమళం పదార్థాలను వేద పండితులు బ్రాహ్మణోత్తముల వేదమంత్రాలతో దంపతుల చేతుల మీదుగా యజ్ఞంలో సమర్పించారు. మధ్యాహ్నం శ్రీకన్వెన్షన్ హాల్లో కైలాస్ చంద్రస్వామిజీ చేపట్టిన శ్రీమద్ భాగవత కథ ప్రవచనం లో రాస్ పంచాధ్యాయి, కంసుని వద్, రుక్మిణి స్వయంవరం కథలతో భక్తులను భక్తి సందేశాలతో మైమరిపించారు. కో ఆర్డినేటర్ గిరిధర్ కుమార్, శ్రీధర్ మహెూత్సవ కమిటీ సభ్యులు నవీన్ మహేశ్వరి, సంజయ్ సరదా, సంజయ్ మొదని, మధుసూదన్, వేణుగోపాల్, అనురాగ్ జాజు, సొబహుద్ కాకని పాల్గొన్నారు.

కార్మికుల దీక్ష విరమణ



ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడులో దీక్ష చేపడుతున్న గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు జీతాలు ఇప్పిస్తానని ఎంపీడీవో హామీ ఇవ్వడంతో మంగళ వారం దీక్షను విరమించారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కుమార్, మునస్వామి, ఆనందయ్య, కృష్ణయ్య, శేఖర్, సుబ్రహ్మణ్యం, మునస్వామి, గోవిందయ్య, సంపూర్ణమ్మ, ధనమ్మ పాల్గొన్నారు.

15న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-ఏర్పేడు: యువ సమాజ నిర్మాణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల ఆగస్టు 15వ తేదీన ఉచిత మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని ఆ సంస్థ ఫౌండర్ డాక్టర్ గానుగపెంట రమేష్, సంస్థ రాష్ట్ర అధ్యక్షులు తాళిక్కాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని.. రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు.

మట్టిని తరలిస్తే కఠిన చర్యలు



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చెరువులు, ప్రభుత్వ భూముల్లో మట్టిని అధికారుల అనుమతి లేకుండా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై మంజునాథరెడ్డి తెలిపారు. మంగళవారం కనమనంబేడు గ్రామ చెరువులోని మట్టిని తరలిస్తున్నారని సమాచారం అందడంతో చెరువు వద్దకు చేరుకుని విచారించగా అధికారుల అనుమతితో మట్టిని ఏకలవ్య గురుకుల పాఠశాల అభివద్ధి పనులకు తరలిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా మట్టిని తరలించరాదని.. తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ క్రాప్ పంట నమోదు చేసుకోండి

ప్రజాశక్తి- బుచ్చి నాయుడుకండ్రిగ: మండలంలోని వరి వేరుశనగ, మినుము పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి భారతి తెలిపారు. రైతులు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ పాసుపుస్తకం జిరాక్స్, ఫోన్ నెంబర్లను అగ్రికల్చర్ అసిస్టెంట్లకు అందజేసి నమోదు చేసుకోవాలన్నారు. ఈ క్రాప్ పంట నమోదు చేసుకుంటే ప్రభుత్వం అందించే రాయితీలు అందుతాయని.. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నగరి నియోజకవర్గంలోని పుత్తూరు డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ను స్థాపించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కళాశాలలోని స్కిల్ హబ్‌లో పదో తరగతి, డిగ్రీ చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు ఫోన్‌నంబరు 6300954441 ను సంప్రదించాలని కోరారు.

ఓటర్ల పరిశీలనపై సమీక్ష



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని క్లస్టర్, యూనిట్, బూత్, ఇన్‌ఛార్జీలతో ఓటరు పరిశీలనపై మంగళవారం పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి యర్రావారిపాలెంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ప్రతి బూతులో ఇప్పటివరకు జరిగిన ఓటర్ పరిశీలన తీరును పరిశీలించి డబుల్ ఎంట్రీలను, దొంగ ఓట్లను గుర్తించి బీఎల్వోలతో తొలగించాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు.

పోలింగ్ స్టేషన్ సందర్శన



ప్రజాశక్తి-ఏర్పేడు : మండలంలోని ఉప సర్పంచుల ఎన్నికల సందర్భంగా రేణిగుంట డీఎస్పీ భవ్య ఏర్పేడు సీఐ శ్రీహరితో కలిసి పెనుమల్లం, మడిపాక గ్రామాలలో పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని ఆదేశించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి 12, 14 మెమోలను తీసుకొచ్చి భవన నిర్మాణ సంక్షేమ బోర్డు సంఘంలో ఉన్న నిధులను నవ రత్నాలు, ఇతర పథకాలకు వినియోగిస్తూ నిధులను దుర్వినియోగం చేస్తోందని ఎద్దేవా చేశారు. నిధులను హైకోర్ట్ తిరిగి జమ చేయమని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించినా ఇప్పటి వరకు భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో జమ చేయలేదు అన్నారు. ఇకనైనా కార్మికుల సొమ్మును తిరిగి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని , లేని పక్షంలో దశల వారిగా భవన నిర్మాణ కార్మికులు తో కలిసి ఉద్యమాలు చేపడుతామని పేర్కొన్నారు. సి.ఐ.టి.యు పట్టణ ప్రధాన కార్యదర్శి సురేష్ , భవన నిర్మాణ కార్మిక నాయకులు పుట్టా శంకరయ్య, శేఖరాచారి, రఫీ, గుర్రం రమణయ్య, నాగరాజు, వేణు రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ఆడికృత్తిక తెప్పోత్సవాలు





ప్రజాశక్తి-పిచ్చాటూరు: మండలంలో రామగిరి పంచాయతీలో కొలువైన శ్రీవళ్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆడి కత్తిక ఉత్సవాలలో భాగంగా మంగళవారం భరణి అభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, పాల ఏకరి కార్పోరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కూమార్‌రాజా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారికి ఆలయ ఛైర్మన్ వెంకటశ్వర్లు, దేవస్థానం ఈవో లత, ఎమ్మెల్యే పాల ఏకరి ఛైర్మన్లను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం భరణి అభిషేకం నిర్వహించి ఆలయ అర్చకులు ఆశీర్వాదం అందించారు. కోనేరులో భరణి తెప్పోత్సవాలు శ్రీవళ్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులు విహరిస్తూ భక్తులు దర్శనమిచ్చారు. తెప్పోత్సవాలను భక్తులు భక్తి శ్రద్ధలతో వీక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ సురేష్ కుమార్, ఎస్సై వెంకటేశ్వర్లు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.భాస్కర్ నాయుడు, ఎంపిటిసి రమేష్ రాజు, తొప్పయ్య, పాలపద్మనాభం, మోహన్, చలపతి రాజు, సుబ్రహ్మణ్యంరెడ్డి, రమేష్, చెంగల్రాయరెడ్డి, బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధూ నీ అవినీతి చిట్టా విప్పేస్తా..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : బొజ్జల కుటుంబం జోలికొస్తే మధూ నీ అవినీతి చిట్టా విప్పేయాల్సి వస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి హెచ్చరించారు.



బొజ్జల హయాంలో శ్రీకాళహస్తీశ్వ రాలయంలో అవినీతి జరిగిందన్న నీ ఆరోపణలపై ప్రమాణం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామనీ, వేదిక ఎక్కడో, ఎప్పుడో చెప్పాలని సవాల్ విసిరారు. ఊరందూరులోని స్వగహంలో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం హయాంలో తాము అవినీతికి పాల్పడి ఉంటే నాలుగేళ్ల పాటు ఎందుకు విచారణ జరపలేదని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని ప్రశ్నించారు. ఆలయంలో అటెండర్‌చే పరిపాలన నడుపుతున్న నువ్వా మమ్మల్ని విమర్శించడం అని ఆయన ఎద్దేవా చేశారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో పాలన సవ్యంగా సాగుతోందా అని ఆయన ప్రశ్నించారు. తమ కుటుంబం జోలికి వస్తే బియ్యపు మధు చిట్టా విప్పుతామని హెచ్చరించారు. ఆలయంలో ఓ అటెండరు స్థాయి ఉద్యోగి పూజారులను బెదిరిస్తూ వసూళ్లు చేస్తున్నాడని, ఇందులో ఎమ్మెల్యేకు 30 శాతం వాటా వెళుతోందని ఆరోపించారు. నువ్వు తిరుగుతున్న ఖరీదైన కార్లు, నీ చేతికి తొడిగిన నాలుగున్నర కోట్ల వాచ్ ఎక్కడవని ప్రశ్నించారు. 'దోచుకో దాచుకో' అంటూ పాలన సాగిస్తూ నీతి, నిజాయితీ గురించి బియ్యపు మధు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అవినీతి నిరూపించడానికి శివయ్య సన్నిధిలో ప్రమాణం చేయమన్నారని, అందుకు తాము సిద్ధమని తెలిపారు.

జనసేన న్యాయ సలహాదారుకు చేదు అనుభవం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకున్న లీగల్ అడ్వైజర్ శాంతిప్రసాద్‌కు ఆలయంలో చేదు అనుభవం ఎదురైంది.



మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి రాగా ఆలయంలో పనిచేసే ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో ఆయన వ్యాఖ్యలు ఆలయ ఈవోకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. జనసేన పార్టీ లీగల్ అడ్వైజర్ శాంతి ప్రసాద్ కుటుంబ సమేతంగా మంగళవారం ఉదయము 6 గంటల సమయంలో రాహు కేతు పూజలో పాల్గొన్నారు. రాహు కేతు పూజలు చేసుకునేందుకు రూ.750 టిక్కెట్టు తీసుకొని భక్తులతో పాటు మండపంలో ముందు వరుసలో కూర్చున్నారు. ఆ మండపంలో పనిచేసే శేఖర్ అనే వ్యక్తి ప్రసాద్ కుటుంబంపై అనుచితంగా ప్రవర్తించాడు. సుదూర ప్రాంతాల నుంచి శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్య వస్తుంటారని, ఇలాంటి సిబ్బందితో ఆలయ అప్రతిష్ట పాలు అవుతుందని ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం శ్రీకాళహస్తి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి కోటా వినుత, చంద్రబాబు ఆలయం వద్దకు చేరుకొని ప్రసాద్ కు మద్దతుగా నిలబడ్డారు. శేఖర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఈవోకు ఫిర్యాదు చేశారు.

పోలీసులపై దాడి దారుణం



ప్రజాశక్తి-బాలాయపల్లి: టిడిపి కార్యకర్తలు, నాయకులు పోలీసులపై దాడి దారుణమని జయంపు సహకార సంఘం అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు బైక్ ర్యాలీతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పుంగనూరులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు సెక్యూరిటీ ఇవ్వడానికి వచ్చిన పోలీసులపై టీడీపీ నాయకులు గూండాలతో దగ్గరుండి దాడి చేయించిన చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధులలో ఉన్న పోలీసులపైన రాళ్లతో దాడి కి పాల్పడే విధంగా రెచ్చగొట్టడం పద్ధతి కాదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం అవ్వడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు వేమూరు వెంకటరమణారెడ్డి, గుండుబోయిన , గోపాలయ్య, రామ్మూర్తి యాదవ్, బెల్లంకొండ సిద్దయ్య, పల్లంటి రాంబాబు, వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని నరసింహ తీర్థం మార్గంలో గల ఎమరాల్డ్స్ ప్రొఫెషనల్ అకాడమీ విద్యార్థులు మంగళవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ విడుదల చేసిన సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ తెలిపారు. ఈ ఫలితాల్లో అభిజిత్ కుమార్ రెడ్డి 320, మోహిత్ కుమార్ రెడ్డి 312, దిలీప్ 296, తారకేశ్వర్ రెడ్డి 292, వెంకట్ యాదవ్ 291 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారన్నారు. ఫలితాల్లో 56.70 శాతం ఉత్తీర్ణత సాధించినట్లుగా చెప్పారు. ఈ సందర్భంగా టాపర్లుగా నిలిచిన విద్యార్థులను, అధ్యాపక బందాన్ని ప్రత్యేకంగా విద్యాసంస్థల డైరెక్టర్లు అభినందించారు.

అంధకారంలో పల్లె ప్రజలు

పుత్తూరు టౌన్: వడమాలపేట మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి సుమారు రెండు గంటల పాటు సమాచారం లేకుండా అర్థాంతరంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ఒక్కసారిగా ఇళ్లల్లో ఉండలేక ప్రజలు వీధుల్లోకి చేరుకున్నారు. విద్యుత్తు అంతరాయంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. విషపురుగుల బెడదతో ఇబ్బందులు పడ్డారు. విద్యుత్తు శాఖ అధికారుల నిర్లక్ష్యంతో తరచూ ఇలాంటి సంఘటనలు జరుగున్నాయని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు.

పాత తిరుచానూరు మార్గంలో
అండర్ పాస్ ఏర్పాటు చేయాలి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పాత తిరుచానూరు మార్గంలో అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ కోరారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం, నందమూరి తారకరామారావు హయంలో తిరుపతి నగర పరిధిలో అనేక అభివద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. తిరుచానూరు అమ్మవారికి అనాదిగా పసుపు కుంకుమ తీసుకు వెళ్లే మార్గంగా గుర్తించబడిన పాత తిరుచానూరు మార్గంలో అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలని గతంలోనే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైల్వే అధికారులతో మాట్లాడి ఒప్పించడం జరిగిందన్నారు. అయితే పాత తిరుచానూరు మార్గంలో ఫుడ్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని అధికార పార్టీ యోచించడం సరికాదని, అందరికీ ఆమోదయోగ్యంగా అనాదిగా గుర్తింపబడిన మార్గంలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డిని కోరారు. గతంలో పాత తిరుచానూరు మార్గంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని ఆనాడు ప్రతిపక్ష నేతగా ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి నిరసనలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వూకా విజయ్ కుమార్, మునికష్ణ, సదాశివం, వేణుగోపాల్, మనోహరాచారి, రాజయ్య పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాకూడదు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: చదువుపై ఆసక్తితో చదవుకునే విద్యార్థులకు పేదరికం అడ్డురాకూడదని రౌవిట్ కంపెనీ అధినేత ఎం.షుఐబ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఈశ్వరి కళ్యాణ మండపంలో రౌవిట్ స్కాలర్షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ అధినేత మాట్లాడుతూ మొత్తం రాయలసీమలో పేదరికంలో ఉన్నపిల్లలకు ఆయా అర్హతలను సర్వే చేసి మొత్తం 234 మంది పిల్లలకు ఈ కార్యక్రమానికి అర్హతగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది మెరుపుల మహేష్, రౌవిట్ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంగళపురిలో 'ఇంటింటికీ మీ బొజ్జల'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని మంగళపూరి, ముద్దముడి గ్రామాలలో మంగళవారం మీ ఆశీర్వాదం కావాలంటూ ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివద్ధి అంటే ఒక తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. అలాగే బొజ్జల గోపాలకష్ణారెడ్డి కాలంలో జరిగిన అభివద్ధి తప్ప మరేది ఈ నాలుగున్నర సంవత్సర కాలంలో ఎక్కడ కనపడటం లేదని తెలిపారు. అలాగే గ్రామస్థులకు పక్కా ఇల్లు, ఇంటింటికి తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయిస్తామని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బొల్లినేని జగన్నాథం నాయుడు, చెంచయ్య నాయుడు, పాపిరెడ్డి, సుబ్రహ్మణ్యం నాయుడు, మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఉపాధ్యాయులు గోపీనాథ్, జయచంద్రన్, బాలసుబ్రహ్మణ్యం సేవలు అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయన్ అన్నారు. పుత్తూరు మండలంలోని గోపాలకృష్ణాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేసి బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన గోపీనాథ్, జయ చంద్రన్, బాలసుబ్రహ్మణ్యంలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించి సత్కరించారు. అనంతరం సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ కేడీ సారథిని సన్మానించారు. ఈ క్రమంలో పదో తరగతి విద్యార్థులకు భౌతిక, రసాయన శాస్త్ర దిక్సూచి మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, బాల గురునాథం, విజయ్ కుమారి, శేఖర్, గోపి, రమేష్ ,శివ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముద్దాయిల అరెస్టు



ప్రజాశక్తి -గూడూరు: హత్య కేసులో ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు గూడూరు డీఎస్పీ సూర్య నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం గూడూరులో డీఎస్పీ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ నెల 4వ తేదీన పట్టణంలోని అరుంధతీవాడలో కొల్లపూడి వెంకయ్య అనే వ్యక్తి దారుణంగా హత్యకు గురయ్యాడు. భార్య కల్పన అలియాస్ చాముండేశ్వరి గూడూరు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మతుడు కొల్లపూడి వెంకయ్య అలియాస్ బట్టోడుకి సంబంధించిన బంధువుల్లోని ఓ మహిళతో, బిరదవోలు నాని అనే వ్యక్తి అక్రమ సంబంధం కలిగి ఉన్నాడనే అనుమానంతో గతంలో పలుమార్లు నానిని మందలించాడు. సుమారు నెలక్రితం మతుడు కొల్లపూడి వెంకయ్య, తన అన్న కొడుకు అయిన కొల్లపూడి వెంకటేష్ అలియాస్ ఏడుకొండలును ఆస్తి విషయమై గొడవపడి కత్తితో గాయపరిచాడు. అది మనసులో పెట్టుకొని వెంకటేష్, తన బాబాయ్ వరుస అయిన వెంకయ్యను ఎలాగైనా హతమార్చాలనుకొని తన స్నేహితులు అయిన, బిరుదవోలు నాని, గుండుపాక రవితేజ, గుర్రం చిన్న, వేసుపాక పెంచలయ్య, కొల్లపూడి తిరుపతయ్యలతో కలిసి తన బాబాయ్ ని చంపాలని ఉందని చెప్పగా, బిరుదవోలు నాని తనను కొల్లపూడి వెంకయ్య తరచూ బెదిరిస్తున్నాడని, అతడిని చంపాలని ఉందని చెప్పడంతో స్నేహితులు ఆరుగురు కలిసి వెంకయ్యను ఎలాగైనా చంపాలని కుట్ర పన్నారు. ఆ అవకాశం కోసం ఎదురుచూస్తున్న వారు 4వ తేది రాత్రి సుమారు 10 గంటల సమయంలో కొల్లపూడి వెంకయ్య గూడూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు పార్క్ వద్ద ఉండగా తెలుసుకున్న కత్తి, మద్యం సీసాలతో పొడిచి హత్యచేసి పారిపోయారు. వారిని మంగళవారం గూడూరు దండోరా కాలనీలో ఉన్నారనే సమాచారం రావడంతో పోలీసులు ఎంతో చాకచక్యంగా వారిని అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన రెండు కత్తులు, రెండు మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గూడూరు టౌన్ సీఐ హజరత్ బాబు, పోలీస్ సిబ్బంది నాగరాజు, రషీద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫాతిమా మృతికి నివాళులు




ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: స్థానిక భవానీనగర్‌కు చెందిన ముస్లిం మహిళ ఫాతిమా మతి చెందారు. విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ భవాని నగరానికి చేరుకుని ఆమె మతదేహానికి నివాళులు అర్పించారు. పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, వార్డ్ కౌన్సిలర్ కేశవాచారి, మహమ్మద్, నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ నగర్‌లో సంయుక్త వార్షిక శిక్షణ శిబిరం



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఎన్సిసి నగర్లో చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, కడప, తిరుపతి జిల్లాలకు చెందిన పాఠశాలల, కళాశాలల నుంచి ఎంపిక చేసిన 500 మంది క్యాడేట్లకు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్యాంపు కమాండెంట్ అజయ్ బార్నేట్ వెల్లడించారు. ఈ సంయుక్త శిక్షణా శిబిరం నాలుగో బెటాలియన్ 35వ రెజిమెంట్ ఏ ఎన్‌సిసి విద్యార్థులకు జూలై 31వ తేదీ నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణలో భాగంగా లైవ్ ఫైరింగ్, సిములేటెడ్ ఫైరింగ్, వెపన్ ట్రైనింగ్, అబ్స్టాకిల్స్ కోర్స్, ట్రైనింగ్, డ్రిల్ వంటి పోరాట కార్యక్రమాల్లో క్యాడెట్లకు నైపుణ్యాలను మెరుగుపరుస్తారన్నారు. విద్యార్థుల మధ్య టీమ్స్ స్పిరిట్, టైం మేనేజ్మెంట్, ఆరోగ్యకరమైన పోటీ వాతావరణాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ఢిల్లీలో అఖిల భారత స్థాయిలో జరిగే థాల్ సేన క్యాంపు, రిపబ్లిక్ క్యాంపులలో పోటీ పడేందుకు ఇక్కడ ఉన్నత స్థాయిలో శిక్షణను అందిస్తామన్నారు.

న్యాయం చేయాలని జేసీకి వినతి



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తాతల కాలం నుంచి తమ ఆధీనంలో ఉన్న భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి తమకు న్యాయం చేయాలని చర్చునూరుకు చెందిన గోకి రెడ్డి, కే మోహనమ్మ జిల్లా జాయింట్ కలెక్టర్ ను వేడుకున్నారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీని కలిసిన బాధితులు మాట్లాడుతూ దామినేడు గ్రామంలోని సర్వే నెంబర్ 185లో 78 సెంట్లు, 185/4 ఎకరా 72 సెంట్లు, 209లో 50 సెంట్లు భూమిని తమ తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. ఇటీవల కొత్రమంగళానికి చెందిన మునిరాజమ్మ మా స్థలాన్ని ఆక్రమించుకొని, మమ్మల్ని బెదిరిస్తోందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తాము సాగు చేసుకుంటున్న భూమిని కాపాడి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో బాధితుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.